teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 186 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 3 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## ఫాస్టాగ్ వినియోగదారులకు గుడ్ న్యూస్

ఫిబ్రవరి 1 నుంచి కేవైసీ ప్రక్రియ నిలిపివేత

ఎన్హెచ్ఏఐ సంచలన నిర్ణయం




2

తెలంగాణలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుక ఇవ్వనుంది. పండుగ సందర్భంగా రైతు భరోసా నిధులు రైతు అకౌంట్లలో జమ చేసేందుకు సిద్ధమవుతోంది. సంక్రాంతి పండక్కి ముందే నిధులు రిలీజ్ చేయాలని నిర్ణయం తీసుకుంది.

# రైతన్నలకు సంక్రాంతి కానుక




### రైతులకు అందనున్న పెట్టుబడి సాయం

తెలంగాణలో రైతు భరోసా విడుదలకు ముహూర్తం ఖరారు

ఎకరానికి రూ. 6,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ

పంట సాగు భూముల గుర్తింపు ఆధారంగానే నిధుల పంపిణీ

తెలంగాణ బ్యూరో, జనవరి 02 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని రైతులందరూ త్వరలోనే రైతు భరోసా డబ్బులు అందుకోనున్నారు. యాసంగి సాగు కోసం ఈ పెట్టుబడి సాయం అందించనుంది. యాసంగి సీజన్‌లో పంట వేసిన రైతులందరికీ త్వరలో అకౌంట్లలో డబ్బులు పడనున్నాయి. శాటిలైట్ సర్వే

మిగతా 2 లో

## నేడే తెలంగాణ టెట్ పరీక్షల ప్రారంభం

### 18 జిల్లాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

జనవరి 3 నుండి 20 వరకు 15 సెషన్లలో పరీక్షలు



హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): మొత్తం 18 జిల్లాల్లో ఏర్పాటు చేసిన 97 కేంద్రాలలో టెట్ పరీక్షలు జరగనున్నాయి. జనవరి 3 నుండి 20 మధ్య మొత్తం 9 రోజుల పాటు, 15 సెషన్లలో అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 21 కేంద్రాల్లో

మిగతా 2 లో

## హిడ్మా మృతి వెనుక టీపీసీసీ నేత హస్తం

### మావోయిస్టుల సంచలన లేఖ

- ఆసుపత్రి పేరుతో శత్రువులకు అప్పగించారని ఆరోపణ
- టీపీసీసీ సెక్రటరీ కారులోనే తరలించినట్లు పార్టీ వెల్లడి
- మావోయిస్టుల వద్ద ఆధారాలు ఉన్నట్లు ప్రకటన



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 02 (తీన్మార్ న్యూస్): మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్కౌంటర్ వెనుక ప్రధాన సూత్రధారి టీ పీసీసీ జనరల్ సెక్రటరీ అంటూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి డివిజన్ కమిటీ విప్లవ్ పేరుతో

మిగతా 2 లో



## కేసీఆర్ అసెంబ్లీకి వస్తేనే పార్టీకి మనుగడ

"లేదంటే అధోగతి...!"

ఉరివేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన

ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు

.. వివరాలు 2లో



## మూసీ వివాదం.. ముదిరిన సెగ

- తెలంగాణ అసెంబ్లీ సమావేశాల బహిష్కరణ
- గులాబీ దళం వ్యూహాత్మక అడుగా..?
- రెండో రోజే సభను వీడిన బీఆర్ఎస్ నేతలు



హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ శీతాకాల సమావేశాలు మొదలైన రెండవ రోజే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ నుంచి సమావేశాలను పూర్తిగా

మిగతా 2 లో

## మున్సిపల్ పోరుకు సమరశంఖం

వచ్చే నెల 3న జడ్చర్ల సభతో సీఎం ఎన్నికల శంఖారావం



.. వివరాలు 2లో



## తెలంగాణ అసెంబ్లీలో కీలక బిల్లుల జాతర

బీఆర్ఎస్ బహిష్కరణ మధ్యే ఐదు బిల్లులకు ఆమోదం

మోటార్ వెహికల్స్ టాక్సేషన్ సవరణ బిల్లుకు పచ్చజెండా

2




## తల్లిదండ్రుల వాట్సాప్‌కే హాల్ టికెట్లు

ఇంటర్ విద్యార్థులకు అలర్ట్

తప్పుల సవరణే లక్ష్యంగా ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం

.. వివరాలు 2లో



## తెలుగు రాష్ట్రాల జల జగడానికి కేంద్రం చెక్

- వివాదాల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు
- సిడబ్ల్యూసి ఛైర్మన్ నేతృత్వంలో సంప్రదింపుల కమిటీ

హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల వివాదాల పరిష్కారానికి కేంద్రం కీలక ముందడుగు వేసింది. సమస్య పరిష్కారానికి కేంద్ర జల సంఘం కమిటీ ఏర్పాటు చేసింది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలో ఈ కమిటీ

మిగతా 2 లో

## మూసీ పునరుజ్జీవంతో నూతన జవజీవాలు

మార్చి 31లోగా టెండర్లు : సీఎం రేవంత్ రెడ్డి

డీపీఆర్ సిద్ధమయ్యాక అసెంబ్లీలో చర్చ

నిపుణులు, ప్రజాప్రతినిధుల సలహాలతోనే ముందడుగు

04





## లక్షా 50 వేల కోట్లా.. లక్ష కోట్లా..?

ప్రభుత్వం సమాధానం చెప్పాలి

మూసీ ప్రాజెక్టుపై నిప్పులు చెరిగిన హరీష్ రావు

ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): ముందుగా మూసీ మోడ్రనైజేషన్ ప్రాజెక్టుకు ఎంత ఖర్చవుతుందో ప్రభుత్వం చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ

మిగతా 4 లో

# రైతన్నలకు సంక్రాంతి కానుక

మొదటి పేజీ తరువాయి

ఆధారంగా పంటలు వేసిన భూములను ప్రభుత్వం గుర్తిస్తోంది. ఈ నివేదిక ఆధారంగా పంట భూములకు మాత్రమే రైతు భరోసా డబ్బులు ఇవ్వనుంది. రైతుబంధు పథకంలో భాగంగా గతంలో ఎకరానికి రూ.5 వేలు అందించేవారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుతం రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6 వేలు ఇవ్వనున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో దాదాపు కోటిన్నర ఎకరాలకు డబ్బులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గత ఏడాది యాసంగిలో సుమారు 79.54 లక్షల ఎకరాల్లో పంట సాగయినట్లు అధికారులు క్షేత్రస్థాయి సర్వే ఆధారంగా గుర్తించారు. ఈ సారి అంతకంటే ఎక్కువ స్థాయిలో పంటలు సాగవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అధికారులు సాగు వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాలన్నీ త్వరలోనే వ్యవసాయశాఖకు అందనుండగా.. ఆ తర్వాత డబ్బులు రిలీజ్ చేయనున్నారు. ఈ యాసంగి సీజన్‌కు రైతు భరోసా పథకం అమలు చేయడానికి రూ.9 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు ఆర్థిక శాఖకు నిధులు విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సంక్రాంతి పెద్ద పండుగ కావడంతో ముందే రైతులకు నిధులు జమ చేస్తే రైతు




ఆనందం రెట్టింపు అవుతుందని ప్రభుత్వం భావించింది. దీంతో పండుగలోపే లబ్ధిదారులందరికీ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. ఇటీవల మీడియాతో మాట్లాడిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా త్వరలో రైతు భరోసా నిధులను జమ చేస్తామని, ప్రస్తుతం సర్వే పూర్తయ్యే దశకు చేరుకుందని ప్రకటించారు. దీంతో రైతు భరోసా నిధుల విడుదలకు మార్గం సుగమం అయిందని చెప్పవచ్చు.

# తల్లిదండ్రుల వాట్సాప్‌కే హాల్ టికెట్లు




తెలంగాణ బ్యూరో, జనవరి 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఇంటర్ బోర్డ్ కీలక ప్రకటన చేసింది. విద్యార్థుల హాల్ టికెట్లను తల్లి దండ్రుల వాట్సాప్ అకౌంట్లకు పంపించనున్నట్టు స్పష్టం చేసింది. దీనివల్ల హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు పడితే త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని వెల్లడించింది. పరీక్షకు అప్లై చేసిన సమయంలో ఇచ్చిన వాట్సాప్ నంబర్‌కే హాల్ టికెట్ లింక్ పంపిస్తామని ఆ లింక్ ఓపెన్ చేసి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ పదవతరగతి హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. రెంవసంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ఫస్ట్ ఇయర్ హాల్ టికెట్ నంబర్ మరియు పుట్టిన తేదీ వివరాలు ఎంటర్ చేసి డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. సెకండ్ ఇయర్ విద్యార్థుల తల్లిదండ్రలకు పంపే లింక్‌లో ఫస్ట్ ఇయర్ లో విద్యార్థి సాధించిన మార్కుల వివరాలు, ఫెయిల్ అయిన సబ్జెక్టుల వివరాలు సైతం ఉంటాయని తెలిపింది. దీనివల్ల విద్యార్థి ఎలా చదువుతున్నాడనేది తల్లిదండ్రులకు తెలుస్తుందని పేర్కొంది. తల్లిదండ్రులు హాల్ టికెట్ లోని పేరు, ఫోటో, హాల్ టికెట్ నంబర్, మీడియం తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేవో క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపింది. ఏమైనా తప్పులు ఉంటే వెంటనే కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయాలని సూచించింది.

# మున్సిపల్ పోరుకు సమరశంఖం

హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థలకు గతనెలలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థులు మెజారిటీ స్థానాలు దక్కించుకున్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే ఊపులో మెజారిటీ మున్సిపాలిటీలను కైవసం చేసుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందుకోసం అన్ని అస్త్రాలను సిద్ధం చేస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు, రాష్ట్ర పీసీసీ పెద్దలు ఇదే ఊపుతో కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేలా పక్కాగా ప్రణాళికలు రూపొందించేందుకు జిల్లా పార్టీ కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో ఎన్నికలు ఉంటాయని మంత్రులు పదే పదే చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో మాదిరిగానే మున్సిపల్ ఎన్నికల కోసం కూడా ప్రచారం చేయడానికి సిద్ధమయ్యారు. మున్సిపల్ ఎన్నికల కోసం వచ్చే నెల 3న జడ్చర్లలో సీఎం రేవంత్ రెడ్డి తొలి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతల ద్వారా తెలిసింది. ఆ తర్వాత మిగతా జిల్లాల్లోనూ రేవంత్ రెడ్డి పర్యటన ఉండనున్నట్లు సమాచారం.

# మూసీ వివాదం.. ముదిరిన సెగ

మొదటి పేజీ తరువాయి

బాయ్ కాట్ చేసి వెళ్లిపోయారు. గులాబీ నేతలు తెలంగాణ అసెంబ్లీ వింటర్ సెషన్‌ను పూర్తిగా బహిష్కరించడం వెనుక ప్రధానంగా రాజకీయ ఒత్తిడి, గత 10 ఏళ్లలో చేసిన తప్పులకు అధికార పార్టీ నుంచి వస్తున్న వ్యక్తిగత దాడులే కారణాలుగా కనిపిస్తున్నాయి.




**అనుకున్నదొక్కటి అయినది ఇంకొక్కటి**

అయితే ఇటీవల మీడియా సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇకపై అధికార పార్టీని వదిలిపెట్టం అని హెచ్చరించడాన్ని బట్టి అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వస్తారని, సభ వాడీ వేడీగా జరుగుతుందని అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జోరుగా నడుస్తుందని అంతా ఊహించారు. కాని సమావేశాలు మొదలైన రెండవ రోజే గులాబీ నేతలు వింటర్ సెషన్స్ ను పూర్తిగా బాయ్ కాట్ చేయడం అందరినీ షాక్ కు గురిచేసింది. అయితే బీఆర్ఎస్ దీనిని వెనుకడుగు కాకుండా ఒక వ్యూహాత్మక నిర్ణయంగా తీసుకున్నట్టు భావిస్తోంది. అసెంబ్లీలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, స్పీకర్ పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సభలో కూర్చొని నిర్లక్ష్యం భరించే బదులు, బయటకు వచ్చి నిరసన తెలపడం ద్వారా ప్రజల్లో సానుభూతి పొందాలని ఆ పార్టీ భావిస్తోంది.

**గులాబీ పార్టీకి లాభమా? నష్టమా?**


ముఖ్యంగా మంగళవారం సమావేశాల్లో మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్‌పై చర్చ సమయంలో ఈ వివాదం మరింత ముదిరింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలు చెప్పే ప్రయత్నం చేసినా, స్పీకర్ అనుమతి ఇవ్వలేదని వారు అంటున్నారు. అంతేకాదు, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కేసీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారని, అసలు అంశాలపై సమాధానం ఇవ్వకుండా వ్యక్తిగత దాడులకు దిగారని బీఆర్ఎస్ తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. దీంతో హరీష్ రావు నేతృత్వంలో సభ్యులు వాకౌట్ చేసి, గన్ పార్క్‌లో నిరసన చేపట్టి, మొత్తం సెషన్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. రాజకీయంగా చూస్తే, ఇటీవల ఎన్నికల పరాజయం తర్వాత బీఆర్ఎస్ పార్టీ తిరిగి బలపడే ప్రయత్నంలో ఉంది. అసెంబ్లీ లోపల అధికార పార్టీ అజెండాకే పరిమితం కావాల్సి వస్తుందని, బయట పోరాటం చేస్తే మీడియా దృష్టిని ఆకర్షించి క్యాడర్‌ను ఉత్సాహపరచవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. అయితే దీర్ఘకాలంలో అసెంబ్లీకి దూరంగా ఉండటం వల్ల ప్రజల సమస్యలను నేరుగా సభలో లేవనెత్తలేకపోవడం, పార్టీ బాధ్యత నుంచి తప్పించుకుంటోందన్న విమర్శలు వచ్చే ప్రమాదం కూడా ఉంది.

**హస్తానికి అనుకూలం**

కాగా ఈ పరిణామం కాంగ్రెస్ ప్రభుత్వానికి కొంతవరకు పాజిటివ్‌గా మారినట్టే కనిపిస్తోంది. అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్య వేదిక అని, ప్రజల సమస్యలను అక్కడే చర్చించి పరిష్కరించాలనే కాంగ్రెస్ వాదనకు ఈ బాయ్‌కాట్ బలాన్ని ఇస్తోంది. ప్రతిపక్షం సభకు రాకపోవడం వల్ల ప్రభుత్వానికి తమ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా వివరించే అవకాశం లభించింది. అంతేకాదు కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని తమది బాధ్యతాయుత పాలన, వారిది బాధ్యత తప్పించుకునే ప్రతిపక్షం అని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ప్రజలు తమను ప్రశ్నిస్తారని భయపడి బీఆర్ఎస్ సభ నుంచి బయటకు వెళ్లిందని, అసెంబ్లీలో చర్చకు ఎదురెళ్లే ధైర్యం లేకనే బాయ్‌కాట్ చేసిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. దీంతో ప్రజాస్వామ్య విలువలను కాపాడేది కాంగ్రెస్‌నే అన్న సందేశాన్ని బలంగా చెప్పుకునే అవకాశం అధికార పార్టీకి దక్కింది. ప్రజలకు కూడా సభలో కూర్చొని పోరాడకుండా బయట ఆందోళనలు చేస్తే ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్న రావడం కాంగ్రెస్‌కు లాభం చేకూరుస్తోంది. మొత్తానికి ఈ బాయ్‌కాట్ బీఆర్ఎస్‌కు తాత్కాలికంగా రాజకీయ లాభం తీసుకు వచ్చినా కానీ భవిష్యత్తులో ఇది పార్టీ ఇమేజ్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నది రాజకీయ నిపుణులు అంటున్నారు.

# తెలంగాణ అసెంబ్లీలో కీలక బిల్లుల జాతర

హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): మూడు రోజుల విరామం తర్వాత శుక్రవారం తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యాయి. శుక్రవారం ఐదు కీలక బిల్లులను సభ ఆమోదించింది. ఇందులో అత్యధికంగా నాలుగు బిల్లులను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రవేశపెట్టారు. తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు-2025, జీహెచ్ఎంసీ (సవరణ) బిల్లు-2025, జీహెచ్ఎంసీ (రెండో సవరణ) బిల్లు-2025తో పాటు తెలంగాణ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు-2025 ఉన్నాయి. అలాగే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ మోటార్ వెహికల్స్ టాక్సేషన్ (సవరణ) బిల్లు-2025ను సభలో ప్రవేశపెట్టారు. ఈ ఐదు బిల్లులను సభ ఆమోదించింది. అంతకుముందు అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బాయికాట్ చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ విషయాన్ని మాజీ మంత్రి హరీష్ రావు మీడియా ద్వారా తెలియజేశారు. స్పీకర్, ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బాయ్ కాట్ చేస్తున్నామని స్పష్టం చేశారు. అసెంబ్లీ తీరు చూస్తుంటే శాసనసభ నిబంధనలకు విరుద్ధంగా ఉందని మండిపడ్డారు.

# నేడే తెలంగాణ టెట్ పరీక్షల ప్రారంభం



మొదటి పేజీ తరువాయి

77,790 మంది, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 24 కేంద్రాల్లో 72,295 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఖమ్మంలో 20,547 మంది, హన్మకొండలో 19,699 మంది, కరీంనగర్ లో 16,390 మంది, హైదరాబాద్ లో 9,539 మంది టెట్ ఎగ్జామ్ రాయనున్నారు. పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే సంప్రదించడానికి విద్యాశాఖ హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. ఫోన్ నంబర్లు: 7093708883, 7093708884 కాల్ చేయాలని సూచించింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని అధికారులు సూచించారు.

# హిడ్మా మృతి వెనుక టీపీసీసీ నేత హస్తం

మొదటి పేజీ తరువాయి

మావోయిస్టులు ఒక లేఖ విడుదల చేశారు. హిడ్మా ను ఆసుపత్రి పేరుతో తెలంగాణా మీదుగా, ఆంధ్రకి అతని కారులో తీసుకుని వెళ్లి శత్రువులకు అప్పచెప్పాడని, దానికి సంబంధించిన వాయిస్ రికార్డ్స్ తమ దగ్గర ఉన్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. హిడ్మా కు మాయమాటలు చెప్పి తీసుకుని వెళ్ళారని, వారికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. అడవులలో ఖనిజ సంపద కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ఆదివాసీలను, ప్రజలకోసం పోరాటం చేస్తున్న వారిని కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్య చేస్తున్నారని విమర్శించారు.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తేనే పార్టీకి మనుగడ

హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరు కావాలని.. సభకు వచ్చి మాట్లాడితే.. బీఆర్ఎస్ పార్టీ బతికి బట్టకడుతుందని కవిత అన్నారు. లేకపోతే పార్టీకి మనుగడ లేదని, అథోగతి అవుతుందన్నారు. సీఎం రేవంత్... కేసీఆర్‌ను ఉరివేయమని అనటం కరెక్ట్ కాదని తెలిపారు. ఉద్యమ నాయకుడిపై అలా ఎలా మాట్లాడతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయంటూ చిట్ చాట్‌లో కవిత వ్యాఖ్యానించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ బీఆర్ఎస్ తప్పిదమేనని.. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా జూరాలకు మార్చ వచ్చు కదా అని కవిత ప్రశ్నించారు. హరీష్ రావు ప్యాకేజీలకు అమ్ముడుపోయాడని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ప్రజల్ని పిచ్చి వాళ్లను చేస్తున్నాయని విమర్శించారు. సెప్టెంబర్ 3న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినా.. ఇంత వరకు తన రాజీనామాను ఆమోదించలేదన్నారు కవిత. ఎందుకు ఆమోదించలేదని అడగడానికే ఇవాళ మండలికి వచ్చినట్లు చెప్పారు కవిత.

# తెలుగు రాష్ట్రాల జల జగడానికి కేంద్రం చెక్

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు అయింది. ఈ కమిటీ సభ్యులుగా రెండు రాష్ట్రాల జలవనరులశాఖ ఉన్నతాధికారులతో పాటు కమిటీలో కృష్ణా, గోదావరి బోర్డుల ఛైర్మన్లు సభ్యులుగా ఉన్నారు. ఏపీ, తెలంగాణ నుంచి నలుగురు అధికారుల చొప్పున కమిటీలో చోటు కల్పించింది. కాగా, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన గత జూలై 16న ఢిల్లీలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కమిటీ ఏర్పాటు చేసి సంప్రదింపుల ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కమిటీలో కేంద్ర జలశక్తి శాఖతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులను నియమించాలని అప్పట్లో నిర్ణయం తీసుకున్నారు. ఏపీ, తెలంగాణ మధ్య ఇటీవల తీవ్ర వివాదస్పదమైన పోలవరం-బనకచర్ల/నల్లమల్ల సాగర్ ప్రాజెక్టుతో పాటు ఇతర వివాదాల పరిష్కారానికి ఈ కమిటీ కృషి చేయనుంది.

# ఫాస్టాగ్ వినియోగదారులకు గుడ్ న్యూస్




న్యూ ఢిల్లీ, జనవరి 02 (తీన్మార్ న్యూస్): నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి కార్లు, జీపులు, వ్యాన్లు సహా అన్ని వాహనాలకు నో యువర్ వెహికల్ (కేవైవీ) ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఫాస్టాగ్ కస్టమర్ల సౌకర్యాన్ని మెరుగుపరచడం, హైవేలో వారు ఎదుర్కొంటున్న యాక్టివేషన్ ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించింది. అన్ని పత్రాలు ఉన్నప్పటికీ కేవైవీ ప్రక్రియ వల్ల ఫాస్టాగ్ యాక్టివేషన్ కోసం ఎక్కువ సమయం వృథా అవుతోందని, అందుకే ఈ నిబంధనను తెచ్చినట్టు ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. ఇప్పటికే జారీ చేసిన ఫాస్టాగ్‌లకు సైతం కేవైవీ అవసరంలేదని పేర్కొంది. కొత్త నిబంధనల ప్రకారం, ఫాస్టాగ్ కనిపించే విధంగా లేకపోవడం, పొరపాట్లు ఉండటం, దుర్వినియోగం కావడం వంటి సందర్భాల్లో మాత్రమే కేవైవీ తప్పనిసరి. సాధారణ కస్టమర్లకు ఇక దీని అవసరం ఉండదు. అలగే, వాహన్ డేటాబేస్ నుంచి వాహన వివరాలను ధృవీకరించి ఫాస్టాగ్ ఇచ్చే సమయంలో బ్యాంకులు యాక్టివేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాయి. ఒకవేళ డేటాబేస్‌లో వివరాలు లభించకపోతే, ఆర్‌సీని ఆధారంగా వెరిఫికేషన్ చేస్తాయి. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన ఫాస్టాగ్‌లకూ ఇదే విధానం వర్తిస్తుంది. ఇప్పటివరకు వాహనానికి సంబంధించి ముందు, సైడ్‌వ్యూ ఫోటోలతో పాటు ఆర్‌సీ, విండ్‌షీల్డ్‌పై ఫాస్టాగ్ స్టిక్కర్ ఫోటోలో అప్‌లోడ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ ఇబ్బందులు తొలగనున్నాయి.

# రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలపై అవగాహన




మహబూబాబాద్ జిల్లా, జనవరి 02 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని గీతాంజలి స్కూల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు జూనియర్ కళాశాల పిల్లలకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ లను వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలం లలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై పిల్లలకు అర్ధమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ ఎం.సాయి చరణ్, వెంకట్ రెడ్డి, అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ వెంకటేశ్వర్లు కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు. సీట్ బెల్ట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పది కేసులు నమోదు చేశారు.

# సావిత్రిభాయి 195వ జయంతి వారోత్సవాలను విజయవంతం చేయండి.

**డిఎస్ఎ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్**



హనుమకొండ కేయు, జనవరి 02 (తీన్మార్ న్యూస్): డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్(డిఎస్ఎ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జనవరి 03 నుండి 26 వరకు నిర్వహించే సావిత్రిబభాయి పూలే 195వ జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద డిఎస్ఎ ఆధ్వర్యంలో వారోత్సవాల డిఎస్ఎ విద్యార్థి సంఘ ఆధ్వర్యంలో ఆవిష్కరించిన తదనంతరం వారు మాట్లాడుతూ అందరికీ సమాన, ఉచిత, నాణ్యమైన విద్యను అందించాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సావిత్రిభాయి పూలే ఆలోచన విధానాన్ని, ఆశయాలను నేటి సమాజాన్ని తెలిచేయాల్సిన అవసరం ఉందని వారి ఆచరణను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ఉండే అసమానతలను పోగొట్టడానికి అందరు కృషి చేయాలనీ వారు పిలుపినిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎ విద్యార్థి సంఘ నాయకులు వెంకటేష్, సూర్య, శివ, శశి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి నీ తీరుమార్చుకో

**భూరుగ వృక్షానికి పట్టిన గతే పడుతుంది నీకు రేవంత్ రెడ్డి**

**కేసీఆర్, హరీష్ రావులను విమర్శించడం అంటే ఆకాశం మీద ఉమ్మినట్లే**



చిన్నకోడూర్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): రేవంత్ రెడ్డి తన స్థాయి మర్చిపోయి వీధి రౌడీ లెక్క బూతులు మాట్లాడడం కుక్క తోక చాందస్తంగా ఉందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మేడికాయల వెంకటేశం అడప దశరథంతో కలిసి జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ప్రెస్ నోట్ విడుదల చేసి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పదేపదే కెసిఆర్ హరీష్ రావులను విమర్శిస్తూ కాలం గడపాలని చూస్తున్నాడని రేవంత్ రెడ్డి నువ్వు తెలంగాణకు ఉద్యమ సమయంలో ద్రోహం చేసింది మర్చిపోయినవా ఇవ్వాలా కెసిఆర్ హరీష్ రావులు లేకుంటే తెలంగాణ రాష్ట్రం సాధ్యపడేదాన్ని ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా హరీష్ రావు ఇరిగేషన్ మంత్రిగా ఉండబట్టే తెలంగాణ ప్రజలలో ఆనందం వెల్లివిరుస్తుందని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయినా కాలేశ్వరం నిర్మించకుంటే తెలంగాణ ప్రజలకు రైతులకు సాగుకు తాగుకు నీళ్లు వచ్చేవాన్ని తెలంగాణ రాష్ట్రాన్ని వ్యతిరేకించినందుకు రేవంత్ రెడ్డి నిన్ను ముందుగాల ఉరితీయాలని నిన్ను ప్రాణాలతోనే బొంద పెట్టాలని తెలంగాణ ప్రజలు చూస్తున్నారని సావుదప్పి కన్ను లొట్టబోయినట్టు తెలంగాణ ప్రజలు నీకు ఓట్లు వేశారే తప్ప నీ పైన నీ కాంగ్రెస్ పార్టీ పైన ప్రేమ ఉండి కాదని కక్కతిన్నాక గ్యారలు చేదు అన్నట్లు తెలంగాణ ప్రజలు మార్పు అనుకున్నారు కానీ నీ తీరు చూసినాక తెలంగాణ ప్రజలు తప్పు తెలుసుకుని చెంపలు వేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా బూతులు మానకుంటే అంతకు మించిన బూతులు మాట్లాడతామని తెలంగాణ ప్రజలు తలుసుకుంటే నిన్ను తిట్ల పురాణం లోనే బొంద పెడతారని అన్నారు.

# సారలమ్మ ప్రధాన ఆర్చి పిటి భీమ్ అమరిక ప్రారంభం

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



తాడ్వాయి, జనవరి 02 (తీన్మార్ న్యూస్): మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల అభివృద్ధిలో భాగంగా సారలమ్మ వన దేవత ప్రధాన ఆర్చి పి.టీ. భీమ్ ను అమరిక పనులు ప్రారంభం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. శుక్రవారం ఎస్.ఎస్.తాడ్వాయి మండలం మేడారం లోని శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల అభివృద్ధిలో భాగంగా సారలమ్మ ప్రధాన ఆర్చి పి.టి. భీమ్ అమరిక పనులను, మోడల్ క్యూలైన్స్ నిర్మాణ పనులు, గద్దెల చుట్టూ ఏర్పాటు చేసే గ్రిల్స్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సారలమ్మ ప్రధాన ఆర్చి పిటి భీమ్ అమరికా పనులు ప్రారంభించడం జరిగిందని , పిటి భీమ్ పైన సారలమ్మ వనదేవత వంశవృక్షం, కోయ బొమ్మల లిపి, చిత్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, ఆలయ పూజారులు, గుత్తేదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పీడీఎస్యు రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి




హనుమకొండ కేయు, జనవరి 02 (తీన్మార్ న్యూస్): జనవరి 05,06,07 తేదీలలో వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే పీ.డీ.ఎస్.యు రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని ఈరోజు ఆర్ట్స్& సైన్స్ కాలేజ్ గ్రౌండ్ నుండి మొదలైన బైక్ రాలిని పి.డి.ఎస్.యూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ ర్యాలీ వరంగల్ పోచమ్మ మైదాన్ అండర్ రోడ్ మీదగా అదల సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద ముగించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు శ్రీనివాస్ పీ.డీ.ఎస్.యు ఐదు దశాబ్దాలపైగా దేశంలో శాస్త్రీయమైన,సమానమైన విద్య విధానం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ మహోజ్వలమైన చరిత్రను నిర్మించిందన్నారు. నేడు దేశంలో ప్రజాస్వామ్యం తీవ్రమైన సంక్షోభ దశలో ఉన్నదనీ,బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం రోజురోజుకు తీవ్రమైపోతున్నదని అదే విధంగా దేశ పౌరుల భవిష్యత్తు కూడా చాలా ఆందోళనకరంగా మారిపోతుందనీ అన్నారు. మానవ సంబంధాలన్నీ కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే విధానాలకు పాలక ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని అన్నారు. సమానమైన,నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని ఆరోపించారు. నిత్యం స్వదేశీ జపం చేసే భాజపా విద్యను వ్యాపార సరుకుగా మారుస్తూ విదేశీ, ప్రైవేటు యూనివర్సిటీలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్య అందించడం ద్వారానే సమాజం పురోగతి చెందుతుందని అందుకు అనుగుణంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లలో విద్యకు అధిక నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ కోసం పీ.డీ.ఎస్.యు సంస్థ మరింత తీవ్రమైన విద్యార్థి ఉద్యమాలు నిర్మించవలసిన ప్రాసంగికత ఉన్నదని తెలిపారు. జనవరి 05న ఏకశిలా పార్కు నుండి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ గ్రౌండ్లో బహిరంగ సభ ఈ బహిరంగ సభకు ప్రముఖ నిర్మాత డైరెక్టర్ సినీ నటుడు ఆర్ నారాయణ మూర్తి గారు మరియు పి.డి.ఎస్.యూ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు పి.ప్రసాద్, సాదినేని వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు వి.సంధ్య, పీ.డి.ఎస్.యు జాతీయ నాయకులు పి మహేష్, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వి.శ్రీకాంత్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు,పి.డి.ఎస్.యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల బాలరాజు, ఐ.ఎఫ్.టి.యు వరంగల్ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, పి.డి.ఎస్.యూ వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్ లు ప్రసంగిస్తారని తెలిపారు. 06,07 తేదీలలో వరంగల్ జిల్లా కేంద్రంలో అబునుస్ ఫంక్షన్ హాల్ లో విద్యార్థి ప్రతినిధుల సభలను నిర్వహిస్తున్నాం ఈ సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు కాత్యాయని విద్మహే కాకతీయ యూనివర్సిటీ, గౌరవాధ్యక్షులు జీవన్ కుమార్ హెచ్ఆర్ఎఫ్, ప్రధాన కార్యదర్శి మైసా శ్రీనివాస్, ప్రారంభ ఉపన్యాసం ప్రొఫెసర్ వికాస్ వాజ్ పాయ్ మరియు ఇతర రాష్ట్రాల సౌ సౌహర్ద ప్రతినిధుల సందేశాలు ఉంటాయి అని తెలిపారు. ఈ రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయవలసిందిగా అన్ని వర్గాల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలబోయిన కిరణ్,ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్, పి.డి.ఎస్.యూ పూర్వ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి కోటేశ్వరరావు, పి.డి.ఎస్.యూ వరంగల్ జిల్లా పూర్వ అధ్యక్షులు రాచర్ల బాలరాజ్, పి.డి.ఎస్.యూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఉమ్మడి వరంగల్ జిల్ల కమిటీ సభ్యులు ఉపాధ్యక్షులు అనిల్ కమిటీ సభ్యులు వంగెటి మోహన్ నాయకులు ప్రకాష్, రాజేష్, బన్నీ, మహేష్, అఖిల్ యూనివర్సిటీ నాయకులు రాజేష్, రాంబాబు, కేటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ రహదారి డబుల్ రోడ్డు పనులకు లైన్ క్లియర్

**మంత్రి కోమటిరెడ్డి కీలక ఆదేశాలు**

**గుండ్లపల్లి స్టేజీ నుండి రహదారి విస్తరణకు గ్రీన్ సిగ్నల్**



హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): డబుల్ రోడ్డు నిర్మాణంపై మంత్రి కోమటిరెడ్డి సప్లమెంటరీ నోట్ విడుదల చేశారు. రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజీ నుండి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కదంబ పెల్లికి సత్యనారాయణ రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. ఆయన శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ కోరిక మేరకు సప్లమెంటరీ నోట్ విడుదల చేశారు. ఇప్పటివరకు జరిగిన పనులకు, కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు మంజూరు చేయడంతో పాటు అక్టోబర్ మాసం వరకు రోడ్డు పనులు పూర్తయ్యే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

# మూసీ పునరుజ్జీవంతో నూతన జవజీవాలు

**మార్చి 31లోగా**
**టెండర్లు : సీఎం రేవంత్ రెడ్డి**
**డీపీఆర్ సిద్ధమయ్యాక అసెంబ్లీలో చర్చ**
**నిపుణులు, ప్రజాప్రతినిధుల సలహాలతోనే ముందడుగు**



హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): మార్చి 31లోగా అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలిచి మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అభివృద్ధి పనులు ప్రారంభించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి మూసీ నది పునరుజ్జీవం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. శాసనసభలో మూసీ పునరుజ్జీవం అంశంపై ప్రశ్నోత్తరాల సందర్భంగా ముఖ్యమంత్రి కలుగజేసుకొని, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్‌కు సంబంధించిన విస్తృత లక్ష్యాలు, ఉద్దేశాలను సభ్యులకు అభివృద్ధి చెందిన నగరాలను అధ్యయనం చేసిన అనంతరం, మూసీలో శుద్ధమైన నీరు నిరంతరం ప్రవహించేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మూసీ తీరం వెంబడి గొప్ప అభివృద్ధి ప్రపంచ వ్యాప్తంగా నదీ పరివాహక ప్రాంతాల్లోనే మానవ నాగరికత అభివృద్ధి చెందిందని, హైదరాబాద్‌కు సంబంధించి నిజాం హయాంలోనే మూసీ తీరం వెంబడి గొప్ప అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. 1908 వరదల అనంతరం హైదరాబాద్ నగరానికి శాశ్వత పరిష్కారంగా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులు నిర్మించారని చెప్పారు. మూసీ నది కాలుష్యం వల్ల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణం, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతోందని, పరిశ్రమల మలినాలు, ఘన వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం కన్సల్టెన్సీలను నియమించి డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. బాపూ ఘాట్ వద్ద మూసా – ఈసా నదుల సంగమంలో ప్రపంచంలోనే ఎత్తైన మహాత్ముడి విగ్రహాన్ని నెలకొల్పే ప్రాంతం గాంధీ సరోవర్‌ను 'ఎ' ఆకారంలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గోదావరి జలాలను తరలించి మూసీ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. మొత్తం 20 టీఎంసీలలో 15 టీఎంసీలను తాగునీటి అవసరాలకు, 5 టీఎంసీలను మూసీలో శుద్ధమైన నీరు నిరంతరం ప్రవహించేందుకు వినియోగించనున్నట్లు చెప్పారు.

**నిపుణుల సలహాలు తీసుకుంటాం**

ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ADB 4 వేల కోట్ల రుణం ఇవ్వడానికి అంగీకరించిందని, కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అవసరమైన అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కూడా ప్రణాళికలో ఉందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదలకు మెరుగైన నివాసాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, ఓల్డ్ సిటీ సహా నగరంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మంచిరేవుల సమీపంలో ఉన్న పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, మూసీ తీరం వెంబడి వివిధ ప్రాంతాల్లో గురుద్వారా, మసీదు, చర్చి నిర్మాణాల ద్వారా మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. డీపీఆర్ సిద్ధమైన తర్వాత శాసనసభ ముందు పెడతామని, దానిపై ప్రజాప్రతినిధులు, నిపుణుల సలహాలు తీసుకుని ముందుకు వెళతామని చెప్పారు. హైదరాబాద్‌ను పర్యావరణ అనుకూలంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# పార్టీ క్రమశిక్షణపై కాంగ్రెస్ ఉక్కుపాదం

**పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా దిగితే సస్పెండ్**
**రెబల్స్‌కు కఠిన హెచ్చరికలు**
**మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై వ్యూహాలు**
**నిరంజన్ రెడ్డి కేసులో కీలక నిర్ణయం**



హైదరాబాద్, జనవరి 02 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం ఎంపీ మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై క్రమశిక్షణ కమిటీ సమావేశంలో చర్చించామని చెప్పారు. నిరంజన్ రెడ్డికి సంబంధించిన కేసుపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈ కేసుకు సంబంధించి మరికొంతమందితో మాట్లాడి వైస్ ప్రెసిడెంట్ ప్రకటన చేస్తారని అన్నారు. కరీంనగర్ నుండి నుండి కూడా కొన్ని ఫిర్యాదులు వచ్చాయని వారికి షోకాజ్ నోటీసులు పంపించి వాళ్లను పిలిపించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అంతేకాకుండా త్వరలో రాబోయే మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ క్రమశిక్షణను అందరూ దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తుపై ఎన్నికలు జరుగుతాయన్నారు. అయినప్పకీ ఎవరైనా పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా బరిలోకి దిగితే సస్పెండ్ చేయబడతారని హెచ్చరించారు. తరవాత సమావేశంలో పూర్తి వివరాలను తెలియజేస్తామని వ్యాఖ్యానించారు. ఇక ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో చాలా చోట్ల కాంగ్రెస్ వర్గాలుగా విడిపోవడం వల్ల నష్టం జరిగిన సంగతి తెలిసిందే. ఒకే పార్టీలో రెబల్స్ బరిలో దిగడం వల్ల ఫలితాలు దారుమారై మూడో వ్యక్తి విజయం సాధించారు.

# గిగ్ వర్కర్లకు ఊరట

**సామాజిక భద్రతపై కేంద్రం ముసాయిదా విడుదల**
**ఏడాదిలో 90 నుండి 120 రోజుల పని దినాలు తప్పనిసరి**
**వేర్వేరు సంస్థల్లో చేసిన పనిని కలిపి లెక్కించే విధానం**




న్యూ ఢిల్లీ, జనవరి 02 (తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం గిగ్‌వర్కర్లకు సంబంధించిన సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించేందుకు కొత్త ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రయోజనాలు పొందడానికి ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే అగ్రిగేటర్ ద్ద కనీసం 90 రోజులు లేదా ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద మొత్తం 120 రోజులు పనిచేయాలి. ఇటీవల గిగ్‌వర్కర్లు సామాజిక భద్రత, మెరుగైన వేతనాలను డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం ముసాయిదా నిబంధనలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఒక రోజుకు ఒక అగ్రిగేటర్ వద్ద పని చేసినా,ఆ రోజు మొత్తం ఒక రోజుగా పరిగణలోకి వస్తుంది. ఒక గిగ్‌వర్కర్ అగ్రిగేటర్ కోసం చేసిన పనికి ఆదాయం సంపాదిస్తే, వారు ఎంత సంపాదించారనే దానితో సంబంధం లేకుండా, ఆ రోజున వారు పనిలో చేసినట్లుగా పరిగణలోకి వస్తుందని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

**ముసాయిదా పత్రంలోని వివరాలు**

- ఒక గిగ్‌వర్కర్ ఒకరోజు ఒక అగ్రిగేటర్ కోసం చేసిన పనికి ఎంత ఆదాయం సంపాదించినా, ఆ మొత్తంతో సంబంధం లేకుండా, వారు ఒక రోజు పాటు పనిలో ఉన్నట్లుగా పరిగణలోకి వస్తుంది.
- ఒక గిగ్‌వర్కర్ ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద పనిచేస్తే, పనిచేసిన రోజుల సంఖ్య అన్ని అగ్రిగేటర్ల నుంచి కలిపి లెక్కిస్తారు.
- ఒక గిగ్‌వర్కర్ ఒకే రోజున ముగ్గురు అగ్రిగేటర్లతో పనిచేస్తే, అది మూడు వేర్వేరు పని దినాలుగా లెక్కిస్తారు.
- అగ్రిగేటర్‌తో కలిసి లేదా పరోక్షంగా పనిచేసే వారిని సైతం గిగ్‌వర్కర్లుగా గుర్తించనున్నారు.
- ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు లభిస్తాయి.
- ఈ ముసాయిదా నిబంధనలకు సంబంధించి తుది నోటిఫికేషన్‌కు ముందు అభిప్రాయాలు చెప్పాలని కేంద్రం కోరింది. 30–45 రోజుల వ్యవధిలో అభ్యంతరాలు మరియు సూచనలను ఆహ్వానించింది. ఏప్రిల్ 1 నుంచి నాలుగు లేబర్ కోడ్‌లలోని అన్ని నిబంధనలను పూర్తిగా అమలు చేయాలనే కార్మిక మంత్రిత్వ శాఖ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. కాగా, ఇటీవల డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న గిగ్‌వర్కర్లు సమ్మె బాట పట్టిన సంగతి తెలిసిందే. సామాజిక భద్రత, మెరుగైన వేతనాలను వారు డిమాండ్ చేశారు. అలాగే, 10 నిమిషాల్లో డెలివరీ విధానాన్ని పూర్తిగా చేయాలని డిమాండ్ చేశారు.

# లక్షా 50 వేల కోట్లా.. లక్ష కోట్లా..?



**మొదటి పేజీ తరువాయి**

సమావేశాల్లో క్వశ్చన్ అవర్ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒకసారి సీఎం లక్ష కోట్లని, మరోసారి లక్షా 50 వేల కోట్లు అని పలుసార్లు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారని, అసలు మూసీ సుందరీకరణ మీద ప్రభుత్వం ఎంత ఖర్చు చేయాలనుకుంటుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వమంటే డబ్బులు లేవు, కోసుకు తింటారా అని అంటున్నారని విమర్శించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్‌కి బెనిఫిట్స్ ఇవ్వమంటే డబ్బులు లేవు అంటున్నారు మరి మూసీ సుందరీకరణ మీద మాత్రం లక్షల కోట్లు ఎలా ఖర్చు చేస్తారు? అని ప్రశ్నించారు.

**ఇప్పటివరకు ఎన్ని నివాసాలు కూల్చారు?**

మూసీ సుందరీకరణలో ఇప్పటివరకు ఎన్ని నివాసాలు కూల్చారు? కూల్చిన నివాసాలకు 2013 భూసేకరణ చట్టం కింద కంపెన్సేషన్ ఇచ్చారా? వేజ్ లాస్ చెల్లించారా? లేదా కేసీఆర్ కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వారిని అసైన్మెంట్ చేసి చేతులు దులుపుకున్నారా? అని నిలదీశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ. 14 న్నర లక్షల డబ్బు ఇవ్వాలి. వాళ్ల పాత ఇంటికి ఆర్ అండ్ బీ ఎస్టిమేట్ చేసి ఆ డబ్బులు చెల్లించాలన్నారు. అలాగే సేలబుల్ రైట్స్ తో కూడినటువంటి 200 గజాల స్థలం, ఇల్లు ఇవ్వాలన్నారు. ఇవి ఇచ్చారా? ఇవ్వలేదా? ఒకవేళ ఇస్తే ఎప్పటిలోగా ఇస్తారు? అని ప్రశ్నించారు.

**కూల్చాల్సిన కట్టడాలు ఎన్ని?**

ప్రభుత్వం ఐడెంటిఫై చేసిన కూల్చాల్సిన ప్రభుత్వ, ప్రైవేటు కట్టడాలు ఎన్ని? ఎంత భూమిని ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరిస్తున్నారు? అని ప్రశ్నించారు. స్వచ్ఛమైన గోదావరి జలాలను మూసిలో వదులుతామన్నారు. అసలు ఈ రెండున్నర టీఎంసీల గోదావరి జలాలు ఎక్కడి నుంచి తెస్తున్నారు? అని ప్రశ్నించారు. కాళేశ్వరంలో భాగమైన మల్లన్న సాగర్ నుంచి ఆ గోదావరి నీళ్లను తెస్తున్నారా? లేక ఎక్కడి నుంచైనా గాలిలో నుంచి తెస్తున్నారా? ఆ రెండున్నర టీఎంసీలు ఎక్కడి నుంచి వస్తున్నాయో సమాధానం చెప్పాలన్నారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను కూలగొడితే బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, గతంలో చెప్పినట్లుగా బుల్డోజర్లకు అడ్డంగా పడుకుని అయినా అడ్డుకుంటామని అన్నారు. ఖాళీ స్థలాలు చాలా ఉన్నాయి ఆ ఖాళీ స్థలాల్లో మూసీ సుందరీకరణ పనులు చేపట్టాలని, కానీ, మూసీ పేరిట పేదల ఇండ్లు కూలిస్తే మాత్రం బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మూసీ సుందరీకరణ ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# గూడ్స్‌కి వాహనాలపై 7.5 శాతం లైఫ్ టాక్స్

**ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్స్ ఏర్పాటు**
**వాహనసారథిలో చేరిన తెలంగాణ రాష్ట్రం**
**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో మోటారు వాహనాల పన్ను విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. శుక్రవారం రవాణా శాఖలో తెలంగాణ మోటారు వాహనాల పన్ను సవరణ చట్టంపై శాసన సభలో చర్చ జరిగింది. ఈ చర్చలో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. 4 వీలర్ తేలికపాటి గూడ్స్ వాహనాలకు త్రైమాసిక టాక్స్ ఉండేదని ప్రస్తావించారు. రవాణా శాఖ నిపుణులతో చర్చించి గూడ్స్‌కి సంబంధించిన వాహనాలపై లైఫ్ టాక్స్ విధిస్తూ 7.5 శాతానికి అమలు చేశామని వివరించారు. ఇది కొత్తగా రిజిస్టకనేషన్ అయ్యే వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేశారు.త్వరలో ఢిల్లీ మాదిరిగా ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్స్‌పై కూడా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వాహన సారథిలో తెలంగాణ చేరలేదని చెప్పుకొచ్చారు. దేశంలో 29 రాష్ట్రాలు వాహన సారథిలో చేరితే తెలంగాణ మాత్రం చేరలేదని.. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని వాహన సారథిలో చేర్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రోడ్ సేఫ్టీపై సెస్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక , మహారాష్ట్ర ,గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ద్విచక్ర వాహనాలకు రూ.2 వేలు, లైట్ మోటార్ వాహనాలకు రూ.5 వేలు , హెవీ వాహనాలకు రూ.10 వేలు రోడ్ సేఫ్టీ సెస్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. కొత్తగా రిజిస్టర్ అయ్యే వాహనాలకు మాత్రమే రోడ్ సేఫ్టీ సెస్ విధించినట్లు వివరించారు. ఆటోలు ,ట్రాక్టర్లకు ఇది వర్తించదని స్పష్టం చేశారు. మరణాలు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలతోనే జరుగు తున్నాయని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఇటీవల ఒక ప్రకటన చేశారని ప్రస్తావించారు. జనవరి 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తాము రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని.. విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం విద్యాశాఖ, సంక్షేమ శాఖ, పలు పాఠశాలలు పాల్గొనేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. రోడ్డు భద్రతాపై విద్యార్థులకు, ప్రతి పౌరుడుకి అవగాహన కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. యూనిసెఫ్ సహకారంతో పలు పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తెలంగాణను రోడ్డు ప్రమాదాల రహితంగా మార్చడానికి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు మంత్రి పొన్నం ప్రభాకర్. రాష్ట్రంలో వెయ్యి మంది రవాణా శాఖ అధికారులు ఉంటే ..1. 80 లక్షల వాహనాలు ఉన్నాయని..ఒక్కొక్కటిగా వాహనాలు పరిశీలించడం కుదరదని చెప్పుకొచ్చారు. ఎవరికీ వారే స్వయంగా వాహనాల ఫిట్‌నెస్ చూసుకోవాలని.. రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. వికారాబాద్ బస్సు ప్రమాదంలో ఎవరో చేసిన తప్పిదానికి అమాయకులు చనిపోయారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ విద్యార్థులు, ఇతర పాఠశాలల్లోని విద్యార్థులు రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు , అధికారులు, విద్యార్థులు అందరూ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో పాల్గొనాలని మార్గనిర్దేశం చేశారు.

# శబరిమల బంగారం చోరీ వ్యవహారం

## దొరికింది తక్కువే అన్న అనుమానంలో సిట్

## మరింత లోతుగా దర్యాప్తునకు రంగం సిద్ధం



**తిరువనంతపురం :** శబరిమల ఆలయ పునరుద్ధరణ పనుల్లో చోరీకి గురైన బంగారంలో ఇప్పటివరకు దొరికినదానికంటే ఇంకా ఎక్కువే పోయి ఉంటుందని ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ అనుమానిస్తోంది. ఇప్పటి వరకుఏ రికవరీ జరిగిన సొత్తు విలును అంచనా వేస్తున్నారు. ఇంకా ఎక్కడెక్కడ ఉందా అని ఆరా తీస్తున్నారు. ముగ్గురు నిందితుల్ని తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ కొల్లం విజిలెన్స్ కోర్టుకు సమర్పించిన దరఖాస్తులో సిట్ ఈ అనుమానం వ్యక్తం చేసింది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రో ప్లేటింగ్ కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని సిట్ తన పిటిషన్‌లో పేర్కొంది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 42.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేట్రింగ్ పక్రియ పూర్తైన తర్వాత మిగిలిన బంగారాన్ని నిందితులు మింగేశారని అభియోగం. ద్వారపాలక విగ్రహాల నుంచి, వాటికి సమీపంలోని రెండు స్తంభాల నుంచి బంగారం పూసిన రేకుల్ని తొలగించారని, గర్భగుడి ద్వారం నుంచి ఇలాంటి ఏడు రేకులు తొలగించి వాటికి బంగారు పూత తిరిగి పూశారని సిట్ కోర్టుకు తెలిపింది. గర్భగుడి నుంచి తొలగించిన ప్లేట్లలో రెండింటిపై విష్ణుమూర్తి దశావతారాలు చెక్కి ఉన్నాయని వివరించింది. ఎలక్ట్రోప్లేట్రింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ పొట్టి తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్‌కు బంగారం అప్పగించాడు. ద్వారపాలక విగ్రహాలపై ఉన్న బంగారు పూసిన రాగి ప్లేట్లపై వాస్తవానికి ఇంకా ఎక్కువ పరిమాణంలో బంగారం ఉందని సిట్ వెల్లడించింది. ఈ కేసులో బంగారాన్ని దొంగిలించిన వ్యక్తి, కొన్న వ్యక్తి కూడా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని ఎలా కలవగలిగారని ముఖ్యమంతి పినరయి విజయన్ ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తు కేరళ హైకోర్టు పర్యవేక్షణలో జరుగుతోందని, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నట్లు తన కార్యాలయ జోక్యమేమీ లేదని స్పష్టంచేశారు. సిట్ దర్యాప్తుపై ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు.

# పుతిన్ నివాసంపై డ్రోన్ దాడులు

## అమెరికాకు ఆధారాలు సమర్పించిన రష్యా

## ట్రంప్ చర్యలకు విఘాతంగా మారిన పరిస్థితులు

**మాస్కో :** యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఉద్రిక్తతలను మరింత పెంచేదిగా మారింది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పాల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. దాడి నిజమేనని నిరూపించుకునే పనిలో పడింది రష్యా. ఇందులోభాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఓ వీడియో విడుదల చేసింది. రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్ట్యుకోవ్ మాస్కోలోని యూఎస్ మిలిటరీ అటాచ్ అధికారులతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా కోస్ట్యుకోవ్ మాట్లాడుతూ.. దాడికి ఉపయోగించిన మానవరహిత విమానం శకలాలను తాము కనుగొన్నట్లు తెలిపారు. తమ దళాలు కూల్చివేసిన అనేక డ్రోన్లలోని నేవిగేషన్ వ్యవస్థలు చెక్కుచెదరకుండా ఉన్నాయన్నారు. వీటిని తమ ప్రత్యేక నిపుణులతో పరిక్షించగా.. డ్రోన్ల దాడి లక్ష్యం నోవ్‌గొరొడ్ ప్రాంతంలోని పుతిన్ నివాసమేనని నిర్ధరణ అయ్యిందన్నారు. ఈ సందర్భంగా ఆ వివరాలన్నింటినీ కోస్ట్యుకోవ్ అమెరికాకు అప్పగించారు. ఇక, ఉక్రెయిన్ ఈ దాడి చేసిందంటూ రష్యా చేస్తున్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. నాటో దేశాలు కూడా మాస్కోకు మద్దతివ్వలేదు. మరోవైపు కీవ్ దాడికి యత్నించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని యూఎస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కూడా వెల్లడించినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో దాడి ఆధారాలను రష్యా అమెరికాకు ఇవ్వడం గమనార్హం. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ముగించడానికి చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ దాడితో అమెరికాకు కూడా మింగుడుపడడం లేదు. ఇది ట్రంప్ తీసుకున్న చర్యలకు విఘాతంగా మారనుంది.

# 5 ఏళ్ల బాలికపై అత్యాచారం

## నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష



**విజయవాడ :** భవానిపురం పరిధిలో 5 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. బాధిత బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు భారీ జరిమానా విధించింది. బాలిక కుటుంబానికి 5 లక్షల రూపాయలు చెల్లించాల్సిందిగా ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. 2024 అక్టోబర్ 9వ తేదీన భవానిపురం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన 5 సంవత్సరాల బాలిక ఆడుకోవటానికి షేక్ ఖాసీం అనే వ్యక్తి ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే షేక్ ఖాసీం బాలికపై అత్యాచారం చేశాడు. ఈ సంఘటనపై అప్పటి మహిళా పీఎస్ ఏసీపీ డా. కే స్రవంతి రాయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తాజాగా, ఈ కేసుపై పోక్సో కోర్టు విచారణ జరిపింది. షేక్ ఖాసీంను దోషిగా తేల్చిన పోక్సో కోర్టు జడ్జి వేల్పుల భవాని అతడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. జైలు శిక్షతో పాటు 5 లక్షల రూపాయల జరిమానా కూడా వేశారు. బాధిత బాలికకు 5 లక్షల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించారు. కాగా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఈ కేసుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. 15 నెలల కాలంలోనే బాలికపై అత్యాచారం చేసిన షేక్ ఖాసీంకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకున్నారు.

# ఈవీఎంలపై దుమారం వేళ.. కర్నాటకలో ఊహించని షాక్

## ఈవీఎంల పనితీరుపై జనం సంతృప్తి వ్యక్తం

## రాహుల్ తరచూ విమర్శలపై భాజపా ఫైర్



**బెంగళూరు :** ఈవీఎంలపై దుమారం రేపుతున్న కాంగ్రెస్‌కు అశనిపాతం లాంటి అనుభవం ఎదురయ్యింది. అది కూడా తమ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక నుంచే రావడం విశేషం. ఎన్నికల పక్రియలో విశ్వసనీయత, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచూ విమర్శలు వ్యక్తం చేస్తోన్న వేళ.. కర్ణాటకలో చేపట్టిన ఓ ప్రభుత్వ సర్వే ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. ఆ సర్వేలో రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ లను విశ్వసిస్తున్నట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీపై భాజపా విమర్శలు గుప్పించింది. ఇవిఎంలను తప్పు పట్టడం ద్వారా రాహుల్ రాజకీయం బయటపడిందని విమర్శలకు పదను పెట్టింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై కర్ణాటక ప్రభుత్వ ఏజెన్సీ కేఎంఈఏ కర్ణాటక మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ అథారిటీ గతేడాది ఆగస్టులో సర్వే నిర్వహించింది. ఆ రిపోర్ట్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం..ఈవీఎంలు విశ్వసించదగినవేనని 83.61శాతం మంది వెల్లడించినట్లు తేలింది. ఇక, ఈ యంత్రాలు కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని 69.39 శాతం మంది అంగీకరించినట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని 91.31 శాతం విశ్వసించినట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేలో 102 అసెంబ్లీ నియోజవర్గాలకు చెందిన దాదాపు 5,100 మంది పాల్గొన్నారు. బెంగళూరు, బెళగావి, కలబురగి, మైసూరు డివిజన్లలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలను సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. ఈ సర్వే ఫలితాలపై కర్ణాటక ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు ఆర్.అశోక్ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఈవీఎంలు నమ్మదగినవి కావని గత కొన్నేళ్లుగా రాహుల్ గాంధీ ఒకే పాట పాడుతున్నారు. మన సంస్థలను ఆయన విశ్వసించడం లేదు. కానీ, ఆయన మాట తప్పని కర్ణాటక రుజువు చేసింది. ఎన్నికలను, ఈవీఎంలను, మన ప్రజాస్వామ్య పక్రియను ప్రజలు నమ్ముతున్నారు. ఈ సర్వే కాంగ్రెస్‌కు చెంపపెట్టు. ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలిసినా.. సిద్ధరామయ్య ప్రభుత్వం మాత్రం స్థానిక ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తామని ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు.

# మహారాష్ట్ర బీడ్ జిల్లాలో దుర్ఘటన

## బావిలోకి దూకి కుమారుడితో సహా తల్లి మృతి

**ముంబై :** మహారాష్ట్ర బీడ్ తాలుకాలో లింబారుయ్ గ్రామ సమీపంలోని వస్తీ ప్రాంతంలో దారుణం చోటు చేసుకుంది. మూడున్నరేళ్ల కుమారుడు వేదాంత్‌తో కలిసి కన్నతల్లి ప్రజక్త రామేశ్వర్ దరాడే (23) నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం ఇంటి నుంచి కుమారుడితోపాటు ఆమె బయటకు బయటకు వెళ్లింది. ఇంటికి తిరిగి ఎంతసేపటికి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు వారి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. వారి ఆచూకీ ఎక్కడ లభ్యం కాలేదు. ఇంటికి300 మీటర్ల దూరంలోని బావిలో చూడగా.. రామేశ్వర్ దరాడే విగత జీవిగా పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని.. మహిళ మృతదేహాన్ని వెలికి తీశారు.నూతిలో నీరు అధికంగా ఉండడంతో.. ఆమె కుమారుడి ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో ఐదు విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసి.. నూతిలోని నీటిని బయటకు తీశారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని బావిలో పోలీసులు కనుగొన్నారు. ఆ మృతదేహాన్ని సైతం బయటకు తీశారు. ఆ తర్వాత ఈ మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం బిడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడితో కలిసి ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణం తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులను పోలీసులు విచారిస్తున్నారు.

# గుండెపోటుతో యూపి బీజేపీ ఎమ్మెల్యే మృతి

## తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి యోగి

**లక్నో :** ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ శ్యామ్ బిహారీ లాల్ శుక్రవారంనాడు గుండెపోటుతో కన్నుమూశారు. బరేలీ జిల్లా ఫరీద్‌పూర్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన ఫిలిబిత్ రోడ్డులోని మెడిసిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జనవరి 1వ తేదీన ఆయన 60వ పుట్టినరోజు జరుపుకొన్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, క్యాబినెట్ మంత్రి ధర్మపాల్ సింగ్ ఏర్పాటు చేసిన సమావేశంలో శ్యామ్ బిహారీ లాల్ పాల్గొన్న సమయంలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఎమ్మెల్యే శ్యామ్ బిహారీ లాల్ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని శ్రీరామని ప్రార్థిస్తున్నానని ఒక సంతాప సందేశంలో పేర్కొన్నారు. డాక్టర్ శ్యామ్ బిహారీ లాల్ గతంలో రోహిల్‌ఖండ్ యూనివర్శిటీ హిస్టరీ డిపార్ట్‌మెంట్ అధిపతిగా పనిచేశారు. 2017లో తిరిగి పోటీ చేసి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి డాక్టర్ సియారామ్ సాగర్‌పై గెలిచారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి ఫరీద్‌పూర్ నుంచి గెలిచారు. పార్టీలో ప్రముఖ నేతగా పేరు తెచ్చుకున్నారు.

# వివాదంలో గ్రోక్ చాట్‌బాట్

## తక్షణ చర్యలకు శివసేన ఎంపీ డిమాండ్




**న్యూఢిల్లీ :** ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ చాట్‌బాట్ గ్రోక్ మరోసారి వివాదంలో చిక్కుకుంది. అసభ్య పదాలు, తిట్లతో విరుచుకుపడుతున్నట్లు గ్రోక్‌పై ఆరంభంలో విమర్శలు వచ్చాయి. రాజకీయంగానూ పక్షపాతంగా ఉందన్న ఆరోపణలూ వినిపించాయి. తాజాగా ఓ కొత్త ట్రెండ్ కారణంగా గ్రోక్ మరోసారి వార్తల్లో నిలిచింది. సాధారణ మహిళ ఫొటోను అశ్లీలంగా మార్చాలని ప్రాంప్ట్ ఇవ్వడం, దానికి గ్రోక్ సంకోచం లేకుండా సమాధానం ఇస్తుండడం వివాదస్పదమవుతోంది. దీంతో మహిళల మార్ఫింగ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. మహిళల గోప్యతకు సంబంధించిన ఈ అంశంపై తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో, ముఖ్యంగా ఎక్స్‌లో నడుస్తున్న అసభ్యకర ట్రెండ్ గురించి మీ దృష్టికి తీసుకురావాలను కుంటున్నా. ఏఐ గ్రోక్‌ను ఉపయోగించి కొందరు మహిళల చిత్రాలను మార్ఫ్ చేస్తున్నారు. మహిళ ఫొటోలను అశ్లీలంగా మార్చాలని గ్రోక్‌కు ప్రాంప్ట్ ఇచ్చి.. వచ్చిన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. ఏఐని ఇలా దుర్వినియోగం చేయడం సరికాదు. గ్రోక్ కూడా ఇలాంటి ప్రాంప్ట్‌లను అంగీకరిస్తోంది. ఇది మహిళల భద్రతకు, వారి హక్కులకు భంగం కలిగిస్తోంది. ఇది కేవలం అనైతికమే కాదు.. నేరం కూడా అని ప్రియాంక చతుర్వేది పేర్కొన్నారు.


# ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్

## ఇరాన్‌లో నిరసనకారుల పట్ల భద్రతా దళాలు వ్యవహరిస్తున్న తీరుపై ట్రంప్ ఆగ్రహం

## శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరపవద్దన్న ట్రంప్

## వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని హెచ్చరిక

## ట్రంప్ జోక్యంపై తీవ్రంగా స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్ సీనియర్ సలహాదారు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్‌లో నిరసనకారులపై అక్కడి భద్రతా దళాలు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరపవద్దని, అలాంటి వారిని అమెరికా కాపాడుతుందని అన్నారు. శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని ఆయన అన్నారు. అమెరికా అన్నింటికీ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సీనియర్ సలహాదారుడు అలీ లారిజాని తిప్పికొట్టారు. ఈ వ్యవహారంలో అమెరికా జోక్యం అవసరం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అమెరికా జోక్యం చేసుకుంటే ఆ ప్రాంతమంతా ఘర్షణలకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు. తమ జాతీయ భద్రత రెడ్ లైన్ వంటిదని, దీనిని పరీక్షించాలనుకోవడం సాహసమే అవుతుందని అన్నారు. దేశంలో ధరలు పెరగడంతో పాటు కరెన్సీ విలువ పడిపోయింది. ఇరాన్ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. దీంతో దేశంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో నిరసనకారులు పోలీసుల కార్లకు నిప్పంటించారు. పలు ప్రాంతాల్లో భద్రతా దళాలు కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు.

# చలికాలం.. ఎక్కువగా ఆకలి వేయడానికి కారణం ఇదే



శీతాకాలంలో మనకు ఎక్కువ తినాలని అనిపించడం చాలా సాధారణం. ముఖ్యంగా వేయించిన వడలు, బజ్జీలు, స్వీట్లు వంటివి తినాలనిపిస్తుంది. చలికాలంలో ఎక్కువ ఆకలి వేయడానికి ప్రధాన కారణం, శరీరం వెచ్చగా ఉండటానికి ఎక్కువ శక్తి (కేలరీలు) అవసరం కావడం. చలికాలంలో శరీర ఉష్ణోగ్రతను స్థిరంగా ఉంచడానికి, మన మెదడు ఎక్కువ శక్తి కోసం ఆహారాన్ని కోరుతుంది.

శీతాకాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల శరీరంలో ఆనంద హార్మోన్ 'సెరొటోనిన్' తగ్గుతుంది. దీని కారణంగా అలసట, మెలటోనిన్ హార్మోన్ పెరుగుతుంది. ఈ హార్మోన్ల అసమతుల్యత మనకు శక్తిని, ఆనందాన్ని ఇచ్చే ఆహారం (చక్కెర, కార్బోహైడ్రేట్లు) కోసం ఆకలిని పెంచుతుంది.

శీతాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఓట్స్, తృణధాన్యాలు, గోధుమ వంటి ఆహారాలు ఎక్కువగా తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కూరగాయలు, సీజనల్ పండ్లు, తృణధాన్యాలు వంటివి తినడం ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నారు. అలాగే.. గోరువెచ్చని నీటిని తరచుగా తాగడం కూడా ముఖ్యం.

శీతాకాలంలో ఎక్కువ ఆకలిగా అనిపించడం సహజం. కానీ, మనం పోషకాహారాలను తీసుకోవడం, తగినంత నీరు తాగడం ద్వారా ఆరోగ్యకరంగా శీతాకాలం గడపవచ్చు. జంక్ ఫుడ్‌కు అలవాటు పడకుండా సరైన ఆహారం తీసుకుంటే, శక్తివంతంగా శీతాకాలాన్ని ఎదుర్కోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# శీతాకాలంలో థైరాయిడ్ బాధితులు వీటిని తినకూడదు



శీతాకాలం థైరాయిడ్ రోగులకు సవాలుతో కూడుకున్నది. నీరసం, అలసట, బరువు పెరగడం, చలిగా అనిపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. మందులతో పాటు, థైరాయిడ్ వ్యాధికి సరైన ఆహారం కూడా చాలా ముఖ్యం. శీతాకాలంలో, ప్రజలు తరచుగా వేడి, వేయించిన, తీపి ఆహారాలను ఎక్కువగా తీసుకుంటారు, ఇవి థైరాయిడ్ సమస్యలను తీవ్రతరం చేస్తాయి. వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.

కొన్నిసార్లు, పేలవమైన ఆహారపు అలవాట్లు కూడా మందుల ప్రభావాన్ని తగ్గిస్తాయి. లక్షణాలను నియంత్రించడానికి, మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శీతాకాలంలో ఏం తినాలి? ఏం తినకూడదు అనే దానిపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం చాలా ముఖ్యం. కాబట్టి, శీతాకాలంలో థైరాయిడ్ రోగులు ఏ ఆహారాలకు దూరంగా ఉండాలో తెలుసుకుందాం..

ఆరోగ్య నిపుణుల ప్రకారం, థైరాయిడ్ రోగులు శీతాకాలంలో వేయించిన, కారంగా ఉండే ఆహారం, జంక్ ఫుడ్ తినకుండా ఉండాలి. ఎందుకంటే ఇవి బరువు పెరగడానికి, అలసటకు కారణమవుతాయి. సోయా, సోయా ఉత్పత్తులను పెద్ద మొత్తంలో తీసుకోవడం వల్ల థైరాయిడ్ హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది.

క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రోకలీ వంటి పచ్చి కూరగాయలు ఎక్కువగా తినడం వల్ల కూడా సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. ఇంకా చక్కెర, శుద్ధి చేసిన పిండి, బేకరీ ఉత్పత్తులను అధికంగా తీసుకోవడం కూడా హానికరం. శీతాకాలంలో టీ, కాఫీని ఎక్కువగా తీసుకోవడం కూడా థైరాయిడ్ రోగులకు మంచిది కాదు. అందువల్ల, ఈ ఆహారాలను పరిమితం చేయడం వల్ల లక్షణాలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

**వీటిని తినండి**

శీతాకాలంలో థైరాయిడ్ రోగులు సమతుల్యమైన, పోషకమైన ఆహారం తీసుకోవాలి. వెచ్చని పాలు, పెరుగు, జున్ను పరిమిత పరిమాణంలో తీసుకుంటే శక్తి లభిస్తుంది. ఆకుపచ్చ కూరగాయలు, కాలానుగుణ పండ్లు, తృణధాన్యాలు అవసరమైన పోషకాలను అందిస్తాయి. బాదం, వాల్‌నట్‌లు, అవిసె గింజలు వంటి గింజలు, విత్తనాలు శక్తిని అందిస్తాయి. చలి నుండి రక్షిస్తాయి. తగినంత ప్రోటీన్ తీసుకోవడం అలసటను తగ్గిస్తుంది. శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. ఈ ఆహారాలు థైరాయిడ్ రోగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి.

**జాగ్రత్తలు**

ప్రతిరోజూ నిర్ణీత సమయంలో మందులు తీసుకోండి.

రోజూ తేలికపాటి వ్యాయామం లేదా యోగా చేయండి.

బాగా నిద్రపోండి

ఒత్తిడిని నివారించడానికి ప్రయత్నించండి.

థైరాయిడ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోండి.

# గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే వెల్లుల్లి..

## అసలు ఇది ఎలా ఉపయోగపడుతుంది?

వంటల్లో ఉపయోగించే వివిధ పదార్థాల్లో వెల్లుల్లి ఒకటి. దీనిని ఎంతో కాలంగా మనం వంటల్లో వాడుతున్నాం. వెల్లుల్లిని వంటలల్లో వేయడం వల్ల వంటల రుచి పెరుగుతుంది. అంతేకాకుండా మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. వెల్లుల్లిలో అల్లిసిన్ అనే క్రియాశీలక పదార్థం ఉంటుంది. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని ఇటీవలి అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. లిపిడ్ ప్రొఫైల్స్, గ్లైసెమిక్ ఇండెక్స్, రక్తపోటు, ఆక్సీకరణ ఒత్తిడి వంటి వాటిని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో వెల్లుల్లి మనకు ఎంతో దోహదపడుతుంది. గుండె ఆరోగ్యానికి వెల్లుల్లి ఏవిధంగా సహాయపడుతుందో వైద్యులు వివరిస్తున్నారు.



**రక్తపోటును తగ్గించడం..**

వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో రక్తనాళాలు వ్యాకోచం చెందుతాయి. తద్వారా రక్తపోటు తగ్గుతుంది. గుండెపై ఒత్తిడి తగ్గుతుంది. గుండె మొత్తం పనితీరును మెరుగుపరచడంలో వెల్లుల్లి మనకు సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచడంలో వెల్లుల్లి మనకు ఎంతో ఉపయోగపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ వల్ల ధమనుల్లో అడ్డంకులు ఏర్పడతాయి. దీంతో తీవ్రమైన గుండె సమస్యల బారిన పడాల్సి వస్తుంది. కనుక వెల్లుల్లిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గి గుండె పనితీరు మెరుగుపడడంతో పాటు గుండె కండరాలు బలంగా తయారవుతాయి.

**రక్తాన్ని పలుచగా చేస్తుంది..**

వెల్లుల్లిలో ఉండే సమ్మేళనాలు రక్తాన్ని పలుచగా చేసి రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తాయి. దీంతో గుండె జబ్బుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. అయితే రక్తం పలుచగా అవ్వడానికి మందులు వాడే వారు వెల్లుల్లిని వాడే విషయంలో జాగ్రత్త వహించాలి. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల తలెత్తే ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడడంతోపాటు దీర్ఘకాలిక గుండె జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చు.

**రక్తనాళాల ఆరోగ్యం..**

గుండె కండరాలు బలహీనపడినప్పుడు లేదా ధమనుల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు గుండె లైనింగ్ వాపులకు గురి అవుతుంది. ఇది జరగకుండా అడ్డుకోవడానికి గుండె లైనింగ్ స్థితిస్థాపకతను, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వెల్లుల్లి మనకు దోహదపడుతుంది. రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచి రక్తప్రసరణ సాఫీగా సాగేలా చేయడంలో కూడా వెల్లుల్లి మనకు సహాయపడుతుంది. ఇలా అనేక రకాలుగా వెల్లుల్లి మనకు సహాయపడుతుంది. దీనిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు శరీర ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. వెల్లుల్లిని ఆహారంలో భాగంగా తీసుకుంటూ చక్కని జీవన శైలిని పాటిస్తూ పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

# నెయ్యిని రోజూ ఉదయాన్నే పరగడుపునే తింటే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!



పాలతో తయారు చేసే పదార్థాల్లో నెయ్యి కూడా ఒకటి. నెయ్యి మన ఆహారానికి చక్కటి రుచిని అందిస్తుంది. నెయ్యితో మనం అనేక తీపి వంటకాలను తయారు చేసుకుని తింటూ ఉంటాం. నెయ్యితో చేసే వంటకాలను అందరూ ఇష్టపడతారని చెప్పవచ్చు. నెయ్యిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. ఆయుర్వేదంలో నెయ్యిని అనేక చికిత్సల్లో ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఆహారంతో కలిపి నెయ్యిని తీసుకోవడానికి బదులుగా నెయ్యిని ఉదయం పూట తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. మన ఉదయాన్ని నెయ్యితో ప్రారంభించడం వల్ల మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి వారు వివరిస్తున్నారు.

**జీర్ణ వ్యవస్థకు..**

నెయ్యిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. జీర్ణశయాంతర ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రేగు కదలికలు మెరుగుపడతాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. నెయ్యిలో బ్యూట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది దాని యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాల వల్ల పేగు ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నెయ్యిలో శోథ నిరోధక లక్షణాలు కూడా ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల వాపులు, నొప్పులు వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. నెయ్యిని తీసుకోవడం వల్ల విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి పోషకాలను మన శరీరం ఎక్కువగా గ్రహించుకుంటుంది. దీంతో శరీరంలో ఆయా విటమిన్ల లోపం లేకుండా ఉంటుంది.



**మెదడు పనితీరుకు..**

నెయ్యిలో ఉండే కొవ్వు ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. అభిజ్ఞా పనితీరును మెరుగుపరచడంలో, జ్ఞాపకశక్తిని పెంచడంలో, ఏకాగ్రతను పెంచడంలో కూడా నెయ్యి మనకు సహాయపడుతుంది. నెయ్యిని తీసుకోవడం వల్ల శరీర శక్తి స్థాయిలు పెరుగుతాయి. అంతేకాకుండా దీనిలో ఉండే కొవ్వులు, విటమిన్లు చర్మం, జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నెయ్యిని ఉదయం పూట తీసుకోవడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. నెయ్యిని తీసుకోవడం వల్ల గుండె, ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈవిధంగా నెయ్యి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిని ఉదయం పూట తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే నెయ్యి మన ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ దీనిని తగిన మోతాదులో తీసుకోవడం చాలా అవసరం. దీనిని అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి.

**బరువు పెరిగేందుకు..**

దీనిలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. కనుక దీనిని అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల శరీర బరువు పెరుగుతుంది. నెయ్యిని అతిగా తీసుకోవడం వల్ల గుండె జబ్బుల అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా కడుపు ఉబ్బరం, విరేచనాలు, కాలేయ సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంది. కనుక దీనిని తగిన మొత్తంలో తీసుకోవడం చాలా అవసరం. రోజూ 1 లేదా 2 టేబుల్ స్పూన్ల మోతాదులో పరగడుపున నెయ్యిని తీసుకోవాలి. దీనిని నేరుగా తీసుకోలేని వారు గోరు వెచ్చని నీటిలో కలిపి తీసుకోవచ్చు. ఇక చురుకైన వ్యక్తులు, ఆరోగ్యవంతులు మాత్రమే దీనిని పరగడుపున తీసుకోవాలి. గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు, అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు ఉన్నవారు దీనిని పరగడుపున తీసుకోకూడదు. ఈ విధంగా మన ఆరోగ్యాన్ని బట్టి తగిన మోతాదులో నెయ్యిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది.



# 5 రికార్డులను తన పేరిట లిఖించుకోనున్న కోహ్లీ

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని కొత్త ఏడాది(2026) 5 రికార్డులు ఊరిస్తున్నాయి. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్.. కేవలం వన్డే ఫార్మాట్‌తో పాటు ఐపీఎల్ మాత్రమే ఆడుతున్న సంగతి తెలిసిందే. తనకు అచ్చొచ్చిన వన్డే ఫార్మాట్‌లో పాత కోహ్లీలా చెలరిగిన అతను.. సౌతాఫ్రికాపై రెండు శతకాలు, ఒక అజేయ హాఫ్ సెంచరీతో గతేడాదిని ఘనంగా ముగించాడు. అదే జోరును కొత్త ఏడాదిలోనూ కొనసాగిస్తే.. 5 రికార్డులను తన పేరిట లిఖించుకోనున్నాడు. ఈ ఏడాది మార్చి చివరి వారంలో ప్రారంభమయ్యే ఐపీఎల్ 2026 సీజన్‌లో విరాట్ కోహ్లీ 9 వేల పరుగుల మైలురాయి అందుకోనున్నాడు. ప్రస్తుతం అతను 259 ఇన్నింగ్స్‌ల్లో 8661 పరుగులతో ఉన్నాడు. మరో 339 పరుగులు చేస్తే ఈ రికార్డ్ కోహ్లీ వశం కానుంది. ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా కోహ్లీ చరిత్రకెక్కనున్నాడు. అంతేకాకుండా ఒక్క ఫ్రాంచైజీ తరఫునే ఈ ఫీట్ సాధించిన ఆటగాడిగా నిలవనున్నాడు. గత మూడు సీజన్లలో 600 ప్లస్ రన్స్ చేసిన కోహ్లీ.. ఈ రికార్డ్ నమోదు చేయడం పెద్ద కష్టమేం కాదు. కోహ్లీ తర్వాత రోహిత్ శర్మ 267 ఇన్నింగ్స్‌ల్లో 7046 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఐపీఎల్‌లో 300 సిక్సర్ల మార్కును చేరుకోవడానికి కోహ్లీ కేవలం 9 సిక్సర్ల దూరంలో ఉన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 9 సిక్సర్లు బాదితే.. కోహ్లీ పేరిట ఈ రికార్డ్ నమోదు కానుంది. ఐపీఎల్ చరిత్రలోనే ఈ ఘనత సాధించిన మూడో బ్యాటర్‌గా కోహ్లీ నిలవనున్నాడు. ఈ జాబితాలో క్రిస్ గేల్(357), రోహిత్ శర్మ(302) విరాట్ కోహ్లీ కంటే ముందున్నాడు. అంతర్జాతీయ




వన్డేల్లో 15 వేల పరుగుల మైలురాయికి విరాట్ కోహ్లీ 443 పరుగుల దూరంలో ఉన్నాడు. ఇప్పటి వరకు కోహ్లీ 296 ఇన్నింగ్స్‌ల్లో 14557 పరుగులు చేశాడు. మరో 443 పరుగులు చేస్తే వన్డేల్లో అత్యంత వేగంగా 15 వేల పరుగుల మైలు రాయి అందుకున్న ఆటగాడిగా కోహ్లీ నిలుస్తాడు. ఓవరాల్‌గా రెండో ఆటగాడిగా చరిత్రకెక్కుతాడు. సచిన్ టెండూల్కర్ 452 ఇన్నింగ్స్‌ల్లో 18426 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. శ్రీలంక దిగ్గజ క్రికెటర్ సంగక్కర రికార్డ్‌ను బద్దలు కొట్టేందుకు కోహ్లీ 42 పరుగుల దూరంలో నిలిచాడు. మరో 42 పరుగులు చేస్తే అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా కోహ్లీ నిలుస్తాడు. సంగక్కర మూడు ఫార్మాట్లలో కలిసి 28,016 పరుగులు చేయగా.. 623 ఇన్నింగ్స్‌ల్లో కోహ్లీ 27,975 రన్స్ చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే అప్‌కమింగ్ వన్డే సిరీస్‌లో ఈ రికార్డ్ బద్దలయ్యే అవకాశం ఉంది. అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన ఆటగాడిగా కూడా కోహ్లీ చరిత్రకెక్కనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 150 హాఫ్ సెంచరీలు నమోదు చేసిన బ్యాటర్‌గా కూడా కోహ్లీ రికార్డ్ అందుకోనున్నాడు. ప్రస్తుతం కోహ్లీ 145 అర్ధ శతకాలతో ఉన్నాడు. మరో 5 హాఫ్ సెంచరీలు బాదితే ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్‌గా నిలవనున్నాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ 164 అగ్రస్థానంలో ఉన్నాడు. సెంచరీలను కలిపి లెక్కిస్తే కోహ్లీ 229 సార్లు 50ం రన్స్ చేయగా.. సచిన్ టెండూల్కర్ 264 సార్లు 50 ప్లస్ రన్స్ సాధించాడు.

## అర్జున్ అచ్చం తండ్రిలాగే చేస్తాడు

### యోగ్‌రాజ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు!




టీమిండియా లెజెండరీ బ్యాటర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ గురించి భారత మాజీ క్రికెటర్, యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అర్జున్ టెండూల్కర్‌లో అద్భుతమైన బ్యాటింగ్ నైపుణ్యం ఉందని, అతను బౌలింగ్‌పై కంటే బ్యాటింగ్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టాలని యోగ్‌రాజ్ సూచించారు. అర్జున్ బ్యాటింగ్ శైలిని స్వయంగా సచిన్ టెండూల్కర్‌తో పోల్చడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన యోగ్‌రాజ్ సింగ్, అర్జున్ టెండూల్కర్ కేవలం బౌలర్ మాత్రమే కాదని, అతను ఒక క్వాలిటీ బ్యాటర్ అని కొనియాడారు. "అర్జున్ టెండూల్కర్ అచ్చం తన తండ్రి సచిన్ లాగే బ్యాటింగ్ చేస్తాడు. అతనిలో నాణ్యమైన బ్యాటింగ్ నైపుణ్యాలు ఉన్నాయి. ప్రజలు అతన్ని కేవలం బౌలర్‌గా చూడటం ఆశ్చర్యంగా ఉంది. నిజానికి అతను బ్యాటింగ్‌పై శ్రద్ధ పెడితే ప్రపంచ స్థాయి బ్యాటర్ అయ్యే అన్ని అర్హతలు ఉన్నాయి" అని యోగ్‌రాజ్ వ్యాఖ్యానించారు. అర్జున్ టెండూల్కర్ సామర్థ్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందని యోగ్‌రాజ్ సింగ్ అన్నారు. "అర్జున్‌ను గనుక నా దగ్గరకు పంపిస్తే, కేవలం ఆరు నెలల్లోనే అతనిని ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా తీర్చిదిద్దుతాను. అతని బ్యాటింగ్ పవర్ ఏంటో చాలా మందికి తెలియదు. అతను నాతో కేవలం 12 రోజులు ఉన్నప్పుడు నేను శిక్షణ ఇచ్చాను, ఆ తర్వాతే అతను రంజీ అరంగేట్రంలోనే సెంచరీ బాదాడు. ఆ సెంచరీ అతని బ్యాటింగ్ సత్తాకు నిదర్శనం" అని యోగ్‌రాజ్ గుర్తు చేశారు. అర్జున్ ప్రస్తుతం బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందేందుకు ప్రయత్నిస్తున్నాడు. దీనిపై యోగ్‌రాజ్ అసహనం వ్యక్తం చేశారు. "అతను బౌలింగ్ చేస్తూ తన విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నాడు. సచిన్ మరియు యువరాజ్ కలిసి అర్జున్‌ను నా దగ్గరకు పంపినప్పుడు, నేను అతని బ్యాటింగ్ చూసి ఆశ్చర్యపోయాను. ఇంత మంచి బ్యాటర్‌ను ఎందుకు బౌలింగ్‌లో వాడుతున్నారు అనిపించింది. అతను బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌గా మారితే టీమ్ ఇండియాకు కూడా పెద్ద ఆస్తి అవుతాడు" అని పేర్కొన్నారు. ప్రస్తుతం అర్జున్ టెండూల్కర్ దేశవాళీ క్రికెట్‌లో గోవా తరపున ఆడుతూ నిలకడగా రాణించే ప్రయత్నం చేస్తున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ నాటికి తన బ్యాటింగ్ మెరుగుపరుచుకుని, తండ్రి వారసత్వాన్ని ఘనంగా చాటాలని అభిమానులు కోరుకుంటున్నారు. యోగ్‌రాజ్ సింగ్ వంటి కఠినమైన కోచ్ నుండి వచ్చిన ఈ ప్రశంసలు అర్జున్ ఆత్మవిశ్వాసాన్ని పెంచే అవకాశం ఉంది. క్రికెట్ గాడ్ కొడుకుగా ఒత్తిడిని ఎదుర్కొంటున్న అర్జున్, యోగ్‌రాజ్ సింగ్ చెప్పినట్లుగా బ్యాటింగ్‌లో రాణించి మరో 'టెండూల్కర్' శకాన్ని పునరావృతం చేస్తారో లేదో వేచి చూడాలి.

# కొత్త జెర్సీలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ స్వాగ్

ముంబై ఇండియన్స్ అంటేనే ఒక బ్రాండ్. ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో కూడా అదే దూకుడును ప్రదర్శిస్తోంది. వచ్చే వారం (జనవరి 9) నుంచి ప్రారంభం కానున్న డబ్ల్యూపీఎల్ 2026 కోసం ముంబై ఇండియన్స్ తమ సరికొత్త జెర్సీని విడుదల చేసింది. ఈసారి జెర్సీలో ముంబై నగర వేగాన్ని, సముద్రపు అలల శక్తిని ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్‌ను రూపొందించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఈ కొత్త డ్రెస్‌లో మైదానంలోకి అడుగుపెట్టేందుకు ఉవ్విళ్లూరుతోంది. ముంబై ఇండియన్స్ తాజాగా విడుదల చేసిన జెర్సీలో ఐకానిక్ బ్లూ అండ్ గోల్డ్ రంగులతో పాటు కోరల్ రంగును కూడా జోడించారు. ఈ డిజైన్‌కు వికెట్ పల్స్ అని పేరు పెట్టారు. ముంబై లోకల్ ట్రైన్ల వేగం, అరేబియా సముద్రపు అలల కదలికల నుంచి ఈ డిజైన్‌ను రూపొందించినట్లు జట్టు యాజమాన్యం తెలిపింది. ఈ జెర్సీ కేవలం ఒక యూనిఫామ్ మాత్రమే కాదని, ముంబై ప్రజల సంకల్పానికి, ముంబై ఇండియన్స్ పోరాట పటిమకు ప్రతీక అని వారు పేర్కొన్నారు. ఈ సీజన్ కోసం జరిగిన మెగా వేలంలో ముంబై ఇండియన్స్ తమ కోర్ టీమ్‌ను నిలబెట్టుకుంది. జట్టులో అత్యంత ఖరీదైన క్రీడాకారిణిగా ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ నాట్ సీవర్-




బ్రంట్ (రూ.3.50 కోట్లు) నిలవగా, న్యూజిలాండ్ స్టార్ అమేలియా కెర్ (రూ.3 కోట్లు) రెండో స్థానంలో ఉంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను రూ.2.50 కోట్లకు రిటైన్ చేసుకున్నారు. వీరితో పాటు సౌతాఫ్రికా స్పీడ్ గన్ షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్ వంటి కీలక ఆటగాళ్లతో ముంబై టీమ్ చాలా బలంగా కనిపిస్తోంది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్ అత్యంత విజయవంతమైన జట్టు. 2023లో జరిగిన మొదటి ఎడిషన్‌లోనే ఛాంపియన్‌గా నిలిచిన ముంబై, గత ఏడాది (2025) జరిగిన మూడో ఎడిషన్‌లో కూడా ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి రెండోసారి టైటిల్‌ను గెలుచుకుంది. ఇప్పటివరకు జరిగిన మూడు సీజన్లలో రెండుసార్లు కప్పు కొట్టిన ఏకైక జట్టు ముంబై మాత్రమే. ఇప్పుడు 2026 సీజన్‌లో కూడా టైటిల్ గెలిచి హ్యాట్రిక్ సాధించాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ జనవరి 9న నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో ప్రారంభమవుతుంది. తొలి మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఈ టోర్నమెంట్ మొత్తం రెండు వేదికల్లో (నవీ ముంబై, వడోదర) జరగనుంది. ఫిబ్రవరి 5న వడోదర వేదికగా గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నారు. హర్మన్‌ప్రీత్ నాయకత్వంలోని ఈ జట్టు తన హోమ్ గ్రౌండ్‌లో సిరీస్‌ను ఘనంగా ప్రారంభించాలని భావిస్తోంది.

# ఆగస్టు, సెప్టెంబర్‌లో భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటన

### ధృవీకరించిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు

బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో భారత్‌లో ఆగ్రహ జ్వాలాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్ తరహాలోనే బంగ్లాదేశ్‌తోనూ ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ఈ క్రమంలోనే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు.. భారత పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆగస్టు సెప్టెంబర్‌లో ఈ పర్యటన ఉంటుందని తెలిపింది. వాస్తవానికి గతేడాదే భారత్.. బంగ్లాదేశ్‌లో పర్యటించాల్సి ఉంది. కానీ ఆ దేశంలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ సిరీస్‌ను బీసీబీ వాయిదా వేసింది. షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వ కూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు చెలరేగిన సంగతి తెలిసిందే. దాంతో గతేడాది ఆగస్టులో జరగాల్సిన భారత్, బంగ్లాదేశ్ సిరీస్‌లు వాయిదా పడ్డాయి. తాజా షెడ్యూల్ ప్రకారం భారత జట్టు ఆగస్టు 28న బంగ్లాదేశ్ చేరుకుంటుంది. ఈ పర్యటనలో బంగ్లాదేశ్‌తో భారత్ మూడు వన్డేలతో పాటు మూడు టీ20ల సిరీస్‌ను ఆడనుంది. బీసీబీ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 1, 3, 6 తేదీల్లో మూడు వన్డేలు, సెప్టెంబర్ 9, 12, 13 తేదీల్లో టీ20 సిరీస్ జరగనుంది. భారత పర్యటనతో పాటు పాకిస్థాన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌లతో ద్వైపాక్షిక సిరీస్‌ల షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. 'ఈ షెడ్యూల్ బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రికెట్ గొప్ప సీజన్‌ను పునరుద్ధరించనుంది. ఇది దేశ అభిమానులకు స్థానికంగా అంతర్జాతీయ క్రికెట్‌ను చూసే అవకాశాన్ని కల్పిస్తుంది. మ్యాచ్ వేదికల వివరాలను త్వరలో ప్రకటిస్తాం.' అని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ ప్రకటనలో పేర్కొంది. అయితే భారత బంగ్లా పర్యటన కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం బంగ్లాదేశ్‌పై భారత పౌరులు ఆగ్రహంగా ఉన్నారు.

## బంగ్లాదేశ్ ఆటగాళ్ల నిషేధంపై ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదు

### మీడియాకు వెల్లడించిన బీసీసీఐ అధికారి

బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడుల నేపథ్యంలో ఆ దేశ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడనివ్వొద్దంటూ కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇటీవల మధ్యప్రదేశ్?కు చెందిన సాధువులు సైతం హెచ్చరికలు చేశారు. బంగ్లా ప్లేయర్లను ఐపీఎల్‌లో అనుమతిస్తే, పిచ్‌లు ధ్వంసం చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ దీనిపై స్పందించింది. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిషేధం విధించడంపై తమకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని బీసీసీఐ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, అందుకే దీనిపై ఇంతకుమించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించారు. కాగా, ఈసారి ఐపీఎల్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన ప్లేయర్ ముస్తాఫిజుర్ ఒక్కడే ఆడే ఛాన్స్ ఉంది. ఇటీవల ముగిసిన మినీ వేలంలో ముస్తాఫిజుర్?ను కోల్?కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ రూ.9.2 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది.

# ఆసీస్ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా రిటైర్మెంట్

ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదో టెస్టు మ్యాచే తన చివరిదని 39 ఏళ్ల ఖవాజా వెల్లడించాడు. 2011లో ఆస్ట్రేలియా టెస్టు జట్టుకు ఎంపికైన ఖవాజా తన కెరీర్‌లో 87 టెస్టులు, 40 వన్డేలు, 9 టీ20ల్లో మొత్తం 8001 పరుగులు చేశాడు. టెస్టుల్లో 16 శతకాలు చేశాడు. ఇదిలా ఉండగా ఈ నెల 4న సిడ్నీ వేదికగా చివరి టెస్టు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఉస్మాన్ ఖవాజా క్రికెట్ కెరీర్‌లో తాను ఎదుర్కొన్న జాతి వివక్ష గురించి వివరించాడు. తాను నల్లజాతి క్రికెటర్?నని, ఆస్ట్రేలియా తరఫున క్రికెట్ ఆడలేనని చాలా మంది అన్నారని ఖవాజా తెలిపాడు. కానీ తాను దాన్ని సాధించి చూపించానని, అది తనకెంతో ఆనందాన్ని తెచ్చిపెట్టిందన్నాడు. అందుకు తనకు చాలా గర్వంగా కూడా ఉందని పేర్కొన్నాడు. మరోవైపు జట్టులోని కొంతమంది సభ్యులు, మీడియా వారు తనతో వివక్షపూరితంగా వ్యవహరించేవారని ఉస్మాన్ ఖవాజా చెప్పాడు. జట్టులోని ఇతర ఆటగాళ్లు గాయపడితే వారిని అయ్యో పాపం అనేవారని, వారి పట్ల సానుభూతి చూపించేవారని ఉస్మాన్ తెలిపాడు. కానీ తన విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉండేదన్నాడు. తాను గాయపడితే తనదే తప్పన్నట్లుగా భావించేవారని పేర్కొన్నాడు. అంతేకాదు తనకు వెన్నునొప్పి వచ్చిన సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నానని చెప్పాడు. అయితే ఈ విషయాల్లో తాను ఎక్కువ బాధను అనుభవించానని ఉస్మాన్ ఖవాజా తెలిపాడు. ఇతర క్రికెటర్లు తప్ప తాగి గాయపడినా వారిని ఒక్క మాట కూడా అనేవారు కాదని, అదే తన విషయంలో వేరే విధంగా ప్రవర్తించేవారని అన్నారు. మరోవైపు క్రికెట్?పై తనకున్న అంకితభావం, నిబద్ధతను శంకించారని, తన సన్నద్ధతను ప్రశ్నించారని ఉస్మాన్? వాపోయాడు. తాను ఎప్పుడూ కొంచెం భిన్నంగానే ఉన్నానని, ఇప్పటివరకు కూడా అలాగే ఉన్నానని ఖవాజా అన్నాడు. అదే విధంగా తాను కలర్ ఫుల్ క్రికెటర్‌నని చెప్పాడు. ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టు తనకు గర్వకారణం, ఆనందదాయకమని చెప్పాడు. క్రికెట్ వెలుపలి సమస్యల గురించి మాట్లాడటం తనను బహిర్గతం చేస్తుందని చెప్పాడు. పాకిస్థాన్‌లో జన్మించిన ఉస్మాన్ ఖవాజా ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించిన మొదటి ముస్లిం క్రికెటర్‌గా నిలిచాడు. క్రమంగా జాతీయ జట్టులో ప్రధాన ఆటగాడిగా మారాడు. అలా అతని క్రికెట్ కెరీర్ చాలా అరుదుగా సరళంగా సాగింది. మొదట కెరీర్ ప్రారంభంలో జట్టుకు ఎంపిక విషయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఆ తర్వాత మెల్లమెల్లగా ఓపెనర్‌గా స్థానం దక్కించుకున్నాడు. 2023లో ఆస్ట్రేలియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజేత జట్టులో భాగమయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో, స్టీవ్? స్మిత్ జట్టుకు దూరమై మళ్లీ వచ్చాడు. మెల్‌బోర్న్ టెస్ట్‌లో 82 పరుగులు చేశాడు. అంతేకాదు 2025లో అతడు 18 ఇన్నింగ్స్‌ల్లో 614 పరుగులు చేశాడు. ఆ సంవత్సరం ప్రారంభంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఉస్మాన్ ఖవాజా 232 పరుగులు చేశాడు.




ఇదిలా ఉండగా ఖవాజా తన కెరీర్‌లో ఇప్పటివరకు 87 టెస్టులు, 40 వన్డేలు, 9 టీ20లు ఆడాడు. మొత్తంగా 8,001 అంతర్జాతీయ పరుగులు చేశాడు. అంతకుముందు, ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా యాషెస్ సిరీస్‌లో భాగంగా త్వరలో జరగనున్న అయిదో టెస్ట్ మ్యాచ్ తర్వాత రిటైరవుతాడని ఆసీస్ మాజీ క్రికెటర్ మైఖేల్ క్లార్క్ అన్నాడు.




## ప్యారడైజ్ నుంచి జడల్ జమానా లుక్ విడుదల

'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి కొత్త ఏడాది సందర్భంగా ఓ కొత్త లుక్‌ను విడుదల చేశారు. 'జడల్ జమానా' అంటూ వచ్చిన ఆ ప్రచార చిత్రంలో నాని యాక్షన్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# విశ్వక్ సేన్ కొత్త మూవీ లెగసీ


టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరో విలక్షణమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'లెగసీ'. ప్యూర్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. పాలిటిక్స్ ఈజ్ పర్సనల్ అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. టీజర్ ప్రారంభం నుండి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ముఖ్యంగా విశ్వక్ సేన్ చెప్పిన డైలాగులు పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి: రాజకీయమంటే పులిమీద సవారీ లాంటిదంటారు.. ఆ పులి మీద నాయకుడు ఒక్కడే కూర్చోవాలా? ఆ కుటుంబం మొత్తం కూర్చోవాలా?దిస్ ఈజ్ యాన్ ఇంటర్నల్ వార్ ఫర్ రియల్ లెగసీ ఈ డైలాగ్స్ చూస్తుంటే, అధికారం కోసం ఒకే కుటుంబంలో జరిగే అంతర్గత పోరు, వారసత్వ రాజకీయాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా విశ్వక్ సేన్ ఈ సినిమాలో ఒక సీరియస్ పొలిటీషియన్ పాత్రలో కనిపిస్తుండటం విశేషం. ఈ చిత్రానికి సాయికిరణ్ రెడ్డి దైడా దర్శకత్వం వహిస్తున్నారు. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ సినిమాలో ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, సచిన్ ఖేడ్కర్, మురళీ మోహన్, కేకే మేనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కలాహి మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమటి, సాయికిరణ్ రెడ్డి దైడా నిర్మిస్తున్నారు.






## టైగర్ ష్రాఫ్‌తో జతకట్టనున్న కృతిశెట్టి

అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్రబృందం. 'ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ దీన్ని భారీ బ్జడెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ'ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.



## 4న మన శంకరవరప్రసాద్ ట్రైలర్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 4న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.



## సంయుక్త మీనన్ ..ది బ్లాక్ గోల్డ్

ది బ్లాక్ గోల్డ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. 'ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణెళ మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: ఎ వసంత్.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463